# కరెంట్ అఫైర్స్

## ఏపీకి స్కోచ్ అవార్డుల పంట

- వివిధ ప్రభుత్వరంగ సంస్థల పనితీరు మెచ్చిన స్కోచ్ ఆంధ్రప్రదేశ్‌కు భారీగా అవార్డులు ప్రకటించింది.
- ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ 11 ఆర్డర్ ఆఫ్ మెరిట్ పురస్కారాలతోపాటు మూడు గోల్డెన్ అవార్డులు, ఒక కార్పొరేట్ ఎక్సలెన్స్ ప్లాటినం అవార్డు (మొత్తం 15 పురస్కారాలు) గెలుచుకుంది. ఇంధన రంగం కూడా పది అవార్డులను సొంతం చేసుకుంది.
- ఇంధన వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సుస్థిర చర్యలకు ఈ పది పురస్కారాలు లభించాయి. ఇ-మెజర్మెంట్ బుక్‌కు ఏపీ ట్రాన్స్‌కోకు స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు, పర్యావరణ పరిరక్షణ చర్యలకు రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్‌కు ఒక అవార్డు, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించినందుకు నెడ్‌క్యాప్‌కు 8 స్కోచ్ పురస్కారాలు దక్కాయి.
- 2018, సెప్టెంబరు 19న దిల్లీలో నిర్వహించిన 53వ స్కోచ్ జాతీయ సదస్సులో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

## మైత్రి పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం

- వారణాసి పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా (ఢాకా నుంచి) రెండు దేశాల మధ్య నిర్మించనున్న మైత్రి పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2018, సెప్టెంబరు 18న ప్రారంభించారు.
- 130 కి.మీ. పొడవైన మైత్రి పైప్‌లైన్ ద్వారా బంగ్లాదేశ్‌కు భారత్ శుద్ధిచేసిన ఇంధనాన్ని సరఫరా చేయనుంది. పశ్చిమ్‌బంగలోని సిలిగురి నుంచి బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్ జిల్లాలోని పర్బతీపూర్ వరకూ దీన్ని నిర్మిస్తారు. రూ.346 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ 30 నెలల్లో నిర్మాణం పూర్తి చేసుకోనుంది. ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్‌ను సరఫరా చేసే సామర్థ్యం ఈ ప్రాజెక్ట్‌కు ఉంది.
- అసోంలోని నుమాలీగఢ్ నుంచి బంగ్లాదేశ్‌లోని పర్బతీపూర్‌కు పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసే పైప్‌లైన్ ప్రాజెక్ట్ పశ్చిమ్‌బంగలోని సిలిగురిని కూడా అనుసంధానిస్తుంది.
- ఈ ప్రాజెక్టుతో పాటు ఢాకా-తోంగీ-జయదేవ్‌పూర్ రైల్వే ప్రాజెక్ట్ పనులనూ ప్రారంభించారు.
- 2018, సెప్టెంబరు 17న ప్రధాని మోదీ తన 68వ జన్మదినం సందర్భంగా రెండు రోజులపాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గం వారణాసిలో పర్యటించి దాదాపు రూ.550 కోట్ల విలువ చేసే వివిధ ప్రాజెక్టులను ప్రారంభించారు.

## చందమామ తొలి పర్యటకుడు యుసాకు మేజవా

- చంద్రుడిని చుట్టివచ్చే తొలి పర్యటకుడి పేరును అమెరికా ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్ 2018, సెప్టెంబరు 18న ప్రకటించింది. జపాన్ సుసంపన్నుడు, ఆన్‌లైన్ ఫ్యాషన్ దిగ్గజం యుసాకు మేజవా (42) ఈ ఘనతను సాధించబోతున్నారని పేర్కొంది.
- 2023లో బిగ్ ఫాల్కన్ రాకెట్‌లో (బీఎఫ్ఆర్) యుసాకు చంద్రుడిని చుట్టి రానున్నారు. ఈ యాత్రకు సంబంధించి ఆయన ఇప్పటికే భారీ మొత్తం చెల్లించాడు. తనతోపాటు మరో 8 మంది కళాకారులను ఆయన చంద్రుడి చెంతకు తీసుకెళ్లనున్నారు.

## పీఎస్ఎల్‌వీ - సీ42 ప్రయోగం

- 2018, సెప్టెంబరు 16న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్‌వీ – సీ42 అంతరిక్ష వాహక నౌకను విజయవంతంగా ప్రయోగించింది.
- దీని ద్వారా బ్రిటన్‌కు చెందిన నోవాసర్, ఎస్1–4 ఉపగ్రహాలను ఇస్రో శాస్త్రవేత్తలు నిర్దిష్ట కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. 33 గంటల కౌంట్‌డౌన్ అనంతరం షార్ మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లిన వాహకనౌక నాలుగు దశల్లో 17.44 నిమిషాల్లో రెండు ఉపగ్రహాలను భూమికి 583 కి.మీ. దూరంలోని సూర్యానువర్తన ధ్రువ కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది.



www.eenadupratibha.net

- నోవాసర్ ఉపగ్రహం (బరువు 445 కిలోలు) ద్వారా అటవీ, భూ పరిశీలన, ఐస్ కవరింగ్ మానిటరింగ్, వరదలు, విపత్తుల గురించి తెలుసుకునే వీలు ఉంటుంది. ఇది సముద్రంలో ఓడలు ఎక్కడున్నాయో కనిపెట్టి, గమ్య స్థానాలకు వెళ్లేందుకు వాటికి సూచనలు ఇస్తుంది.
- ఎస్1-4 ఉపగ్రహం (బరువు 444 కిలోలు) అత్యంత స్పష్టత ఉన్న భూపరిశీలన ఉపగ్రహం. ఇది పర్యావరణ పరిశీలన, పట్టణ నిర్వహణ, విపత్తులపై అధ్యయనానికి ఉపయోగపడుతుంది.
- తాజా ప్రయోగంతో ఇప్పటివరకు 243 విదేశీ ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా రోదసిలోకి పంపింది.

## ఉపరాష్ట్రపతి మూడు దేశాల పర్యటన

2018, సెప్టెంబరు 14 నుంచి 20 వరకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సెర్బియా, మాల్టా, రొమేనియాల్లో పర్యటించారు. సెప్టెంబరు 14న సెర్బియా చేరుకున్నారు.

- సెప్టెంబరు 15న సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వూసిక్‌తో రాజధాని బెల్‌గ్రేడ్‌లో సమావేశమయ్యారు.
- సెప్టెంబరు 16న వెంకయ్య నాయుడు సెర్బియా పార్లమెంట్‌లో ప్రసంగించారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్షల్ టిటో – పండిట్ జవహర్‌లాల్ నెహ్రూల గౌరవార్థం సెర్బియా పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. నెహ్రూ తర్వాత సెర్బియా పార్లమెంట్‌లో ప్రసంగించిన భారతీయ నేత వెంకయ్యనాయుడు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక తపాలా బిళ్లల్ని వెంకయ్య నాయుడు విడుదల చేశారు. పంటలు, ప్రత్యక్ష ప్రసారాలు, వాణిజ్యం, పర్యటక రంగాలకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి.
- సెప్టెంబరు 17, 18లలో మాల్టాలో పర్యటించిన వెంకయ్య నాయుడు ఆ దేశ అధ్యక్షురాలు మేరీ లూయిస్ కొలైరో ప్రెకాతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. నౌకాయానం, ఉన్నత విద్య, పర్యటక రంగాలకు సంబంధించి మూడు ఒప్పందాలు కుదిరాయి.
- సెప్టెంబరు 19న రొమేనియా రాజధాని బుఖారెస్ట్‌లో ఆ దేశాధ్యక్షుడు క్లౌస్ వెర్నెర్ లొహనీస్‌తో ఆయన సమావేశమయ్యారు. భారత్ – రొమేనియా విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందాలపై సంతకాలు చేశారు.
- సెప్టెంబరు 20న రొమేనియా వాణిజ్యవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. రొమేనియాలో ఆయుర్వేదంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఆయుష్ సమాచార విభాగాన్ని ప్రారంభించారు. ఆయుర్వేదంపై రెండు పుస్తకాలను ఆవిష్కరించారు.

## తలాక్‌ను నిషేధిస్తూ ఆర్డినెన్స్

- ముస్లింలు తక్షణం విడాకులు ఇచ్చేందుకు వీలు కల్పించే ట్రిపుల్ తలాక్ పద్ధతిని నేరంగా పరిగణించే ఆర్డినెన్స్‌కు కేంద్ర కేబినెట్ 2018, సెప్టెంబరు 19న ఆమోదం తెలిపింది. ఈ ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అదేరోజు సంతకం చేశారు.
- ఈ ఆర్డినెన్స్ ప్రకారం ట్రిపుల్ తలాక్ చెప్పడం నిషిద్ధం, చట్ట విరుద్ధం, శిక్షార్హం అవుతుంది. ఈ నేరానికి పాల్పడే భర్తకు మూడేళ్ల వరకు జైలు శిక్షను ప్రతిపాదిస్తూ నిబంధనలు చేర్చారు.
- ఈ ఆచారం చెల్లదని సుప్రీంకోర్టు చరిత్రాత్మక రీతిలో 2017, ఆగస్టు 22న తీర్పు ఇచ్చినప్పటికీ తక్షణ తలాక్‌తో విడాకులిస్తున్న దాఖలాలు అనేకం ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్డినెన్స్‌కు వెళ్లాల్సి వచ్చిందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు.
- సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కేంద్రం ప్రవేశపెట్టిన ట్రిపుల్ తలాక్ బిల్లు 2017, డిసెంబరు 28న లోక్‌సభలో ఆమోదం పొందింది. అయితే రాజ్యసభ ఆమోదం తెలపాల్సి ఉంది.
- తక్షణ ట్రిపుల్ తలాక్‌ను భారత్ సహా 22 దేశాలు ఇప్పటికే నిషేధించాయి. ఈ జాబితాలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, శ్రీలంక కూడా ఉన్నాయి.

## జపాన్ ప్రధానిగా మరోసారి షింజో అబే

- జపాన్ ప్రధానమంత్రి షింజో అబే అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యారు. 2021, ఆగస్టు వరకు ఆయన జపాన్ ప్రధానిగా కొనసాగనున్నారు.

- అబే ఈ పదవికి ఎన్నికవడం వరుసగా ఇది మూడోసారి. తొలిసారిగా 2012, డిసెంబరులో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఈ పదవిలో అత్యధిక కాలంపాటు కొనసాగనున్న నేత ఆయనే కావడం గమనార్హం. ఇది ఆయన చివరి పర్యాయం.
- 2018, సెప్టెంబరు 20న జరిగిన పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 807 ఓట్లకు అబే 553 దక్కించుకున్నారు. ఆయన ప్రత్యర్థి, మాజీ రక్షణ మంత్రి షిగేరు ఇషాబికి 254 ఓట్లు లభించాయి.
- తాజా విజయంతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా ఒత్తిడి వల్ల 1947లో రూపొందించిన రాజ్యాంగాన్ని సవరించేందుకు అబేకు మార్గం సుగమమైంది.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**